క్లుప్తంగా

నేడు పడిపూజ మహోత్సవం

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే 6 కొత్త రోడ్డులోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం అయ్యప్ప స్వామి మండల పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు వెలిమా రెడ్డి శివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కెరళకు చెందిన సంజీవనంబుద్ధి గురుస్వామి ముఖ్యఅతిథిగా హాజరై పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. గురుస్వాములు కొండ శీను, రాజేశ్వర, రామలింగస్వామి, దేవేందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం స్వాములకు భిక్ష, సాయంత్రం పడిపూజా అనంతరం అగ్నిగుండాల ప్రవేశ కార్యక్రమం ఉంటుందన్నారు. కావున పెద్ద సంఖ్యలో స్వాములు, భక్తులు హాజరై పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని అందుగులపేటలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మల్లేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని మందమర్రి, క్యాతన్‌పల్లి, హాజీపూర్, నస్పూర్, పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకుల దాడి

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో ఆదివారం రాత్రి కాంగ్రెస్ విజయోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేసినట్లు సోదరి రాజయ్య అనే వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. చెన్నూర్ ఎమ్మెల్యేగా వివేక్ అత్యధిక మెజార్టీతో గెలిచినందుకు సంబురాలు జరుపుకుంటూ వెళ్తుండగా బీఆర్ఎస్ నాయకులు దాడి చేసినట్లు వారు పేర్కొన్నారని తెలిపారు. కాగా జరిగిన సంఘటనపై గల వీడియోలు పరిశీలించి దాడి చేసిన వారిని గుర్తిస్తామని ఎస్సై తెలిపారు.

ఐఎన్టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా సమ్మయ్య



మందమర్రిరూరల్: ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా మందమర్రి ఏరియాకు చెందిన కాంపెల్లి సమ్మయ్యను నియమిస్తూ ఆ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. తనకు పదవి ఇచ్చినందుకు ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌తో పాటు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో యూనియన్ బలోపేతంతో ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేస్తానని సమ్మయ్య తెలిపారు.

కార్యకర్తల సమావేశం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్ రావు ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకు సంబురాలు చేసుకుని స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించినందుకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు చింత అశోక్, శ్రీధర్, రాజలింగు, నర్సింహచారి, ముల్కల్ల రాందాస్, రాజు, నవాబ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం వద్ద రైతులు

వేమనపల్లి: మండలంలో దస్నాపూర్ గ్రామానికి చెందిన డీసీఎంఎల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సెంటర్ ఇన్‌చార్జి తాల్ల తిరుమల్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2103 మద్దతు ధర ఉంటుందని ఆయన తెలిపారు. దళారులను ఆశ్రయించకుండా రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పోషగౌడ్, రామగౌడ్, వెంకగౌడ్, రోషిరెడ్డి, తిరుపతి గౌడ్, నాళ్ల వెంకగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫలించని ప్రముఖుల వ్యూహం..!

- అమిత్ షా, కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ పర్యటించినా ఫలితం శూన్యం



చెన్నూర్ పట్టణంలో నిర్వహించిన రోడ్డు షో లో ప్రసంగిస్తున్న కేటీఆర్ (ఫైల్)

చెన్నూర్: నియోజకవర్గంలో మంత్రులు ప్రచారం చేసినా ఓట్లు రాలలేదు. మంత్రుల ప్రసంగాలు ప్రజలను ఆకట్టుకోలేక పోయాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మంత్రులు చేసిన ప్రయత్నం ఫలించలేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ తరఫున చెన్నూర్, మందమర్రి పట్టణాల్లో కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ప్రచారం చేశారు. కేటీఆర్ కంటే ముందుగా చెన్నూర్‌లో హరీశ్‌రావు రోడ్డు షో నిర్వహించారు. బీఆర్ఎస్ స్టార్ కాంపెయినర్లుగా పేరున్న వీరిద్దరూ చెన్నూర్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేసినా ఓట్లు రాబట్టుకోలేక పోయారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. బాల్క సుమన్ ఎన్నికల ప్రచారం విషయంలో అప్పటి మంత్రుల ప్రచారం పైనే ఆధారపడి ఓటమి పాలయ్యారని పలువురు చర్చించుకుంటున్నారు. వారి పర్యటనలతో ప్రజల్లో జోరుగా ప్రచారం జరిగిందని నమ్మిన సుమన్, నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో ప్రచారం నిర్వహించలేక పోయారు. కేవలం మండలాల్లో రోడ్డు షోలు నిర్వహించి చేతులు దులుపేసుకున్నారని అనుచరగణం అంటున్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోలేదు..

ఎన్నికలకు రెండు నెలల ముందుగానే కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించారు. రెండు నెలల సమయాన్ని సుమన్ సద్వినియోగం చేసుకోలేదని వాదనలు విన్పిస్తున్నాయి. రెండు నెలల సమయంలో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేయకపోవడంతో పాటు పార్టీకి దూరంగా ఉన్న వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నియోజకవర్గంలో భారీ నష్టాన్ని చవిచూశారని పలువురు అనుచరులు పేర్కొంటున్నారు.

నమ్మినవారే నట్టేట ముంచారు...

నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి నినాదంతో రెండో సారి బాల్క సుమన్ ఎన్నికల బరిలో దిగారు. అభివృద్ధి అనుచరగణాన్ని నమ్ముకున్నారు. నమ్ముకున్న వాళ్లే సుమన్‌ను నట్టేట ముంచారని ప్రచారం సాగుతోంది. అనుచరగణాన్ని నమ్ముకొని పూర్తి స్థాయిలో ప్రజలను కలువ లేకపోవడంతో ఘోర పరాజయం పాలయ్యారని చర్చించుకుంటున్నారు.

మంచిర్యాలటౌన్: నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ప్రముఖులు వచ్చి ప్రచారం చేసినా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఓట్లు అంతంత మాత్రంగానే వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యమైన నేతలు ఎవరూ రాకపోయినా, ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపి ఓటు వేశారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున కేటీఆర్ మంచిర్యాల పట్టణంలో రోడ్‌షో చేసి వెళ్లారు. ఆ తరువాత గులాబీ బాస్ కేసీఆర్ నస్పూర్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరై బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించి, పలు హామీలు గుప్పించారు. బీజేపీ తరుపున కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మంచిర్యాలలో రోడ్‌షో చేశారు. ఈ రెండు పార్టీలకు చెందిన వారు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టినా, ఆ స్థాయిలో ఓట్లు మాత్రం ఆ రెండు పార్టీలకు పడలేదు. అమిత్ షా రోడ్డు షోతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగి, గతంకు భిన్నంగా ఓట్లు పడ్డాయి. కేటీఆర్, కేసీఆర్‌లు వచ్చి ఎన్నికల ప్రచారం చేసినా, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో మూడో స్థానంలో నిలవడంతో, ఆ పార్టీ శ్రేణుల్లో కొంత నైరాశ్యం కనిపిస్తోంది. 2014, 2018లో రెండుసార్లు బీఆర్ఎస్ పార్టీనే గెలుపొందగా, మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందని, బీఆర్ఎస్ నాయకులు భావించినా, ప్రజలు అందుకు విరుద్ధంగా తీర్పునిచ్చారు. మంచిర్యాల నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,74,807 కాగా, 1,90,057 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో కాంగ్రెస్‌కు 1,05,945 ఓట్లు, బీజేపీకి 39,829 ఓట్లు, బీఆర్ఎస్‌కు 37,989 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు 66,116 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

'ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా పాలన ఉండాలి'



మాట్లాడుతున్న కలవేన శంకర్



మాట్లాడుతున్న ఖలీందర్ అలీఖాన్

పాతమంచిర్యాల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టుల పోరు ఎప్పటికీ ఉంటుందని ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ప్రభుత్వం పనిచేయాలని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనమనేని సాంబశివరావును ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, కొత్తగా అధికారం చేపట్టే ప్రభుత్వం సుపరిపాలన అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఖలీందర్ అలీఖాన్, మిట్టపల్లి పౌలు, మిర్యాల రాజేశ్వర్‌రావు, మండల కార్యదర్శులు మేదరి దేవవరం, దేవి పోచన్న, బొంతల లక్ష్మీనారాయణ, పెర్క రాజేశం, జిల్లా సమితి సభ్యులు రవీందర్, మహేందర్‌రెడ్డి, రమణారెడ్డి, కోడి వెంకటేశం, నర్సయ్య పాల్గొన్నారు.

'ప్రజాసమస్యలపై పోరు ఆగదు'

జన్నారం: ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, ప్రజల సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టుల పోరు ఎప్పటికీ ఆగదని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఖలీందర్ అలీఖాన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఫలితాల్లో అహంకార వైఖరిని ప్రజలు అంగీకరించరని తేలిందన్నారు. ప్రజాస్వామ్యంలో విలువలతో కూడిన పాలన అవసరమని, ప్రజా గొంతుకగా చట్టసభలో సీపీఐకి ప్రజలు అవకాశం కల్పించడం హర్షనీయమన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో నాలుగు మిత్ర పక్ష కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసినట్లు తెలిపారు. నియంతలా, నిరంకుశ పాలన కొనసాగించిన పాలకులకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎర్రజెండా పార్టీలు అధికారం కోసం ఎప్పుడు తాపత్రయ పడలేదని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడు పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉంటాయన్నారు. సమావేశంలో సీపీఐ మండల కన్వీనర్ విజయ్, జిల్లా కమిటీ సభ్యుడు పౌలు, దేవి పోచన్న, మహేందర్‌రెడ్డి, బాను పటేల్, రవి, కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు రాజశేఖర్, శంకరయ్య, సుధాకర్‌నాయక్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వెల్లివిరిసిన చైతన్యం

- పోలింగ్ శాతంలో ఆదర్శం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల్లో భాగంగా జరిగిన పోలింగ్‌లో హాజీపూర్ మండలంలోని గిరి గ్రామాలు పలువురికి ఆదర్శంగా నిలిచాయి. ర్యాలీ, గఢ్‌పూర్, నాగారం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లకు ఓటర్లు పోటెత్తారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓట్లు వేసి వందశాతం ఓటింగ్ సమీపానికి చేరువయ్యారు. 97వ పోలింగ్ స్టేషన్ ర్యాలీ గ్రామంలో 746ఓటర్లకు గాను 678మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 103పోలింగ్ స్టేషన్ గఢ్‌పూర్‌లో 819మందికి 710మంది ఓటర్లు, 104పోలింగ్ స్టేషన్ నాగారంలో 975మంది ఓటర్లకు 852మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో ఈ గ్రామాల్లో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదు కావడంతో ఎన్నికల అధికారులు ఓ వైపు సంతృప్తి వ్యక్తం చేయగా, ఇక రాజకీయ పార్టీల్లో మాత్రం ఓటింగ్ పెరగడంతో ఎవరికి ఏం ముప్పు జరుగుతుందోనన్న ఆందోళన కూడా నెలకొనగా ఫలితాలు సైతం అందరినీ ఆశ్చర్యపరిచాయి. పోలింగ్ శాతంగా చూస్తే ర్యాలీ 91 శాతం, గఢ్‌పూర్ 86 శాతం, నాగారం 88శాతం పోలింగ్ జరిగింది.

'గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతాం'

కాసిపేట: మండల కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి గ్రూపులు లేవని, వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరం కలిసి ముందుకు సాగుదామని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో అధికంగా మెజార్టీ ఇచ్చిన ఓటర్లకు, నాయకులకు, కార్యకర్తలకు అన్నివర్గాలకు కాంగ్రెస్ పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ జెడ్పీటీసీ రౌతు సత్తయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వంశీధర్‌రావు, మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ సిరాజ్‌ఖాన్, నాయకులు గోలేటి స్వామి, మైదం రమేష్, తోడేటి కృష్ణ, మేడ రాంచందర్, సోనేరావ్, ధరావేణి రాజయ్య తదితరులున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవం



ర్యాలీలో నృత్యం చేస్తున్న నాయకులు

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు విజయం సాధించడంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విజయోత్సవం జరుపుకున్నారు. మండల కేంద్రంలో సోమవారం వివిధ గ్రామాల నాయకులు, మండల నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. భారత్ గ్యాస్ కార్యాలయం నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ తీశారు. టపాసులు కాలుస్తూ, నృత్యం చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. అంబేద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు. రంగులు చల్లుకుని ఆడి పాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు రాజశేఖర్, సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో పట్టం కట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మండల సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. ప్రజల సమస్యలపై స్పందించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జన్నారం ఎంపీటీసీ రి యాజోద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకరయ్య, ఫసీఉల్లా, కరుణాకర్, ఇందయ్య, రమేశ్, క రుణాకర్, మాణిక్యం, సుదాకర్‌నాయక్, ఇషాక్, లక్ష్మీనారా యణ, సోహేల్, అజార్, శాకీర్, రాజేశ్, రాకేశ్, ముజ్జు, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మందమర్రి మండలంలో 14,160 మెజార్టీ'

మందమర్రిరూరల్: చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. నియోజకవర్గంలో మందమర్రి, చెన్నూర్, కోటపల్లి, జైపూర్, భీమారం ఐదు మండలాలకు గాను 1,88,283 మంది ఓటర్లు ఉన్నారు. మందమర్రి మండలంలో మందమర్రి మున్సిపాలిటీ, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ, పది గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో 77, 205మంది ఓటర్లకు గాను 57,010మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కు 18,809మంది ఓటు వేయగా, కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామికి 32,969మంది ఓటు వేయగా కాంగ్రెస్ 14,160ఓట్ల మెజార్టీతో ముందు నిలిచింది. ఓట్ల లెక్కింపు సమయంలో ముందుగా మందమర్రి మండల ఓట్లను లెక్కించడంతో ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి, బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ కంటే మెజార్టీ సాధించారు. చెన్నూర్ టౌన్‌లో 19,558ఓటర్లకు గాను 14,566మంది ఓటు హక్కు వినియోగించుకోగా 4,996మంది ఓటర్లు బీఆర్ఎస్‌కు, 8,537మంది ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేయగా కాంగ్రెస్ అభ్యర్థి 3,541మెజార్టీ సాధించారు. చెన్నూర్ మండలంలో 26,507మంది ఓటర్లుండగా 23,191మంది ఓటు హక్కును వినియోగించుకోగా 7,678ఓట్లు బీఆర్ఎస్‌కు 13,163మంది కాంగ్రెస్‌కు ఓటు వేయగా 5,485ఓట్ల మెజార్టీ వచ్చింది. జైపూర్‌లో 24,284మంది ఓటు హక్కు వినియోగించుకోగా 8,197మంది ఓటర్లు బీఆర్ఎస్‌కు, 13,788మంది ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేయగా 5,591మెజార్టీ వచ్చింది. భీమారంలో 8,379మంది ఓటు హక్కు వినియోగించుకోగా బీఆర్ఎస్‌కు 3,695మంది ఓట్లు వేయగా కాంగ్రెస్‌కు 8,008ఓట్లు వేయగా 4,313ఓట్ల మెజార్టీ వచ్చింది. కోటపల్లి మండలంలో 25,735మంది ఓటర్లకు గాను 23,018మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో బీఆర్ఎస్‌కు 8,089మంది ఓటు వేయగా కాంగ్రెస్‌కు 12,336మంది ఓటు వేశారు.4,247ఓట్ల మెజార్టీ కాంగ్రెస్‌కు వచ్చింది. ప్రతి మండలంలోనూ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి మెజారిటీ సాధించి ఎమ్మెల్యేగా గెలుపు పత్రాన్ని అందుకున్నారు.

అసాంఘిక శక్తులపై నిఘా



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



ప్రయాణికులతో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

- అటవీప్రాంతాలు, వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు

కోటపల్లి: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో కోటపల్లి మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అసాంఘిక శక్తులపై నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ విద్యాసాగర్, ఎస్సై సురేశ్ తెలిపారు. నాగంపేట, బొప్పారం అటవీప్రాంతాల్లో సోమవారం క్షుణ్ణంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వారోత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు వివరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ విద్యాసాగర్ కోరారు. తనిఖీల్లో స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

'మావోయిస్టుల ప్రలోభాలకు ఆకర్షితులు కావొద్దు'

వేమనపల్లి: మావోయిస్టుల ప్రలోభాలకు లొంగకుండా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రాణహిత పెర్రీ పాయింట్ వద్ద నీల్వాయి ఎస్సై సుబ్బారావుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. నీల్వాయి, కోటపల్లి అటవీ ప్రధాన రహదారి వెంట ఆర్‌వోపీ నిర్వహణ, బ్రిడ్జి కల్వర్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8వ తేదీ వరకు నిర్వహించనున్న వారోత్సవాలకు ఎవరు సహకరించకూడదని, ప్రలోభాలకు లొంగకూడదన్నారు. అపరిచిత, కొత్త వ్యక్తులు కలిస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

హాజీపూర్‌లో అత్యధికంగా ఓటింగ్

- మండలంలో 82 శాతం పోలింగ్
- ర్యాలీలో 91 %, దుబ్బపల్లిలో 73 % పోలింగ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నిక నేపథ్యంలో జరిగిన పోలింగ్‌లో హాజీపూర్ మండలంలో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటు వేశారు. మండలంలో 26,883మంది ఓటర్లు ఉండగా ఇందులో 13,334మంది పురుషులు, 13,549మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మండలంలో వందశాతం పోలింగ్ జరిగేలా ఎన్నికల అధికారులతో పాటు ఆయా పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, పోలీస్‌లు కూడా పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. పోలింగ్ రోజున ఇతర మండల, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ ఎలా ఉన్నా హాజీపూర్ మండలంలో మాత్రం భారీగా ఓటింగ్ శాతం నమోదైంది. దీంతో 22,240మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని ఓటింగ్ శాతంలో మండలాన్ని ఉన్నత స్థానంలో నిలిపారు.

గ్రామాల వారీగా పోలింగ్ ఇలా...

మండలంలో గ్రామాల వారీగా పోలింగ్ శాతం వివరాలు ఇలా ఉన్నాయి. ర్యాలీ 91, దొనబండలో 85, పెద్దంపేటలో 85, గఢ్‌పూర్ 86, నాగారం 87, హాజీపూర్‌లో 85, సబ్బెపల్లి 85, టీకానపల్లిలో 88, పడ్తనపల్లి 85, కర్ణమామిడి 83, నర్సింగాపూర్ 85, వేంపల్లి 85, గుడిపేట 80, దుబ్బపల్లి 73, రాపల్లి 82, కొండపల్లి 90, గుడిపేట 81, ముల్కల్ల 88 శాతంతో పోలింగ్ జరిగింది.

హాజీపూర్‌లో కాంగ్రెస్‌కు 7,858 ఓట్ల ఆధిక్యం

- ప్రేంసాగర్‌రావుకు సంపూర్ణ మద్దతు
- రౌండ్ల వారీగా కాంగ్రెస్‌కు తగ్గని మెజారిటీ



హాజీపూర్ మండలంలో ఓటు వేసిన మూడు తరాల ఓటర్లు(ఫైల్)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ విజయంలో కీలకంగా నిలిచింది. కాంగ్రెస్ పార్టీ తొలి రౌండ్ నుంచి దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఆధిక్యతను కనబరుస్తూ రాగా అదే జోష్ హాజీపూర్ మండలంలోనూ కొనసాగింది. ఓట్ల లెక్కింపులో భాగంగా 8వ రౌండ్ నుంచి హాజీపూర్ మండలంలోని 97వ పోలింగ్ స్టేషన్ నుంచి ప్రారంభం కాగా ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధికత్యలోనే దూసుకెళ్లింది. 128వ పోలింగ్‌స్టేషన్ వరకు కూడా కాంగ్రెస్‌కు ఓట్లు ఎక్కువ సంఖ్యలోనే పోలయ్యాయి. మండలంలో 26,883మంది ఓటర్లకు గాను 22,240మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా ఇందులో 12,937ఓట్లు కాంగ్రెస్‌కు పోల్ కాగా బీఆర్ఎస్‌కు 5,079ఓట్లు, బీజేపీకి 3,000వేల ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్‌కు మండలంలో 7,858ఓట్ల మెజారిటీ వచ్చింది. మండలంలో 82శాతం ఓటింగ్ నమోదు కాగా ఓటింగ్‌లోనూ కాంగ్రెస్ ప్రధాన పార్టీకీ మెజారిటీ ఇవ్వడంలోనూ ప్రాధాన్యతనిచ్చారు.


ఘనంగా బ్లడ్‌బ్యాంక్ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకు 15వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. 15ఏళ్లుగా రక్తనిధి కేంద్రం ద్వారా ఎంతో మందికి అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందించి, ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం కోసం వచ్చే గర్భిణులకు అవసరమైన రక్తాన్ని అందించి, తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్తాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. తమ రక్తనిధి కేంద్రానికి రామగుండం ఎన్టీపీసీ, సింగరేణి, దేవాపూర్ సిమెంట్ కంపెనీ ఇలా పలు సంస్థల సహాయ సహకారాలతో అధునాతన యంత్రాలను ఏర్పాటు చేసుకుని, బ్లడ్‌బ్యాంకును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బ్లడ్ బ్యాంకులో కేక్ కట్ చేసి, విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఘనంగా సన్మానించి, చిరు కానుకలను అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్ర రెడ్డి, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ చందూరి మహేందర్, కోశాధికారి పడాల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు వి.మధుసూదన్ రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, కె.సత్యపాల్ రెడ్డి, ఎస్.నాగేందర్ పాల్గొన్నారు.

'బీజేపీ బలపడుతోంది'



మాట్లాడుతున్న తిరుపతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు పెరగడం, బీజేపీకి సంపూర్ణ మద్దతు లభిస్తుండటం వంటి అంశాలను పరిశీలిస్తుంటే ప్రజాబలంతో మరింత బలపడుతోందనడానికి ఈ ఎన్నికలే నిదర్శనమని బీజేపీ హాజీపూర్ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి అన్నారు. హాజీపూర్ మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో బీజేపీ మరింత బలపడి, ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ మండల సమన్వయకర్త గాదర్ల సతీశ్, నాయకులు మడిపెల్లి సత్యం, నర్సయ్య, మల్లేశ్, సాయిసత్యం, శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.